## సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(ప్రజాక్షేత్రం) :** సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు. సంప్రదాయ వంటకాలపై అవగాహన కల్పించడం, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం మరియు సమతుల్య ఆహారం ప్రాధాన్యతను తెలియజేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ ఆహార మహోత్సవంలో భాగంగా విద్యార్థులు రకరకాల ఆరోగ్యకరమైన సంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. స్టాళ్లలో ప్రదర్శించిన వంటకాల తయారీ విధానం, వాటిలోని పోషక విలువల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల కృషిని అభినందించారు. ఈ వేడుక విద్యార్థుల మధ్య ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, మన సంస్కృతిలో భాగమైన ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన పెంచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పురానే విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## సాలూర పాఠశాలలో ఘనంగా స్కూల్ ట్విన్నింగ్ కార్యక్రమం

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(ప్రజాక్షేత్రం) :** విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన, విద్యాబోధనలో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన స్కూల్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ గాంధీ ఎంపీపీఎస్ విద్యార్థులు సాలూరలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత పాఠశాలల మధ్య భాగస్వామ్యాన్ని పెంచడం, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య యోగ, క్రీడలు, బోధనాంశాలను పంచుకోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా అతిథి విద్యార్థులకు ఐఎఫ్పీ ప్యానెల్ ద్వారా ప్రత్యేక ప్రేరణాత్మక సెషన్ నిర్వహించారు. అనంతరం సందర్శకులు పాఠశాలలోని కిచెన్ గార్డెన్, తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి పాఠశాల వాతావరణంపై ఆసక్తి కనబరిచారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ సాలూర విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రుద్రూర్ గాంధీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి రత్నకుమారి, ఉపాధ్యాయులు తాటి సునంద, రాధా, గంగా శంకర్, అతార్, శివా కుమార్, రోజా, సాలూర జడ్పీహెచ్ఎస్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పురానే విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సుధారాణి, అరుణ్ కుమార్, గంధం సాయిలు, పి.డి సంగీత్రావు, లక్ష్మి, స్వామి, రాజ్ కుమార్, అబ్బయ్య, విజయలక్ష్మి, విఠల్ కాంబ్లే, అంజన, మేడి రవి, అక్షయ్ కుమార్ జాదవ్, వనజ, సాయిలుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.





## సాలూర క్యాంప్ లో పర్యటించిన ఎంపీడీఓ శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(ప్రజాక్షేత్రం) :** సాలూర క్యాంప్‌లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఎంపీడీవో శ్రీనివాస్ నేతృత్వంలోని అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని పలు ప్రభుత్వ విభాగాలను తనిఖీ చేశారు. ముందుగా సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, పాలనాపరమైన అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పచ్చదనం పెంపులో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించిన అధికారులు, మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఎంపీడీవో స్పష్టం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కార్యదర్శి దమ్మాయి రవి తదితరులు పాల్గొన్నారు.



# జీతాల్లేని సేవ...నిరాశలో ఆశా వర్కర్ల జీవితం

- ఆరోగ్య సేవలు వారి చేతుల్లో... జీతాలు మాత్రం గాలిలో
- రెండు నెలలుగా చెల్లించని వేతనాలు సేవ మాత్రం ఆగదు
- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మహిళలకు ప్రభుత్వ గుర్తింపు ఎక్కడ?
- రూ.18 వేల కనీస వేతనం కోసం మళ్లీ ఉధృతమవుతున్న ఆశా వర్కర్ల పోరాటం
- మహిళా దినోత్సవ ప్రత్యేక కథనం ప్రజాక్షేత్రం కూకట్ పల్లి ప్రతినిధి









మహిళా దినోత్సవం పేరుతో వేదికలపై మహిళా శక్తి గురించి గొప్ప గొప్ప ప్రసంగాలు వినిపిస్తున్న వేళ... అదే సమయంలో ప్రజల ఆరోగ్యాన్ని భుజాలపై మోస్తున్న ఆశా వర్కర్లు రెండు నెలలుగా జీతాలు లేక బతుకు భారాన్ని మోస్తున్నారు. ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సేవలు అందించే మహిళలే తమ కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో ఉంటే, మహిళా సాధికారత గురించి చెప్పే మాటలకు అర్థం ఏమిటి? మహిళలను గౌరవిస్తున్నామనే నినాదాల కంటే, ఆశా వర్కర్ల శ్రమకు న్యాయం చేయడమే నిజమైన మహిళా దినోత్సవం కాదా?

మహిళా దినోత్సవం రోజున దేశమంతా మహిళల సేవలను కొనియాడుతోంది. కానీ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆశా వర్కర్ల జీవితాల్లో మాత్రం పండుగలా కాదు... బాధలా మారింది. రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "పిండి కొద్దీ రొట్టె" అనే నానుడి అందరికీ తెలిసిందే. కానీ ఆశా వర్కర్ల జీవితాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతోంది. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగులకంటే ఎక్కువగా చేయించుకుంటూ, వేతనం మాత్రం కనీస జీవనానికి కూడా సరిపోని స్థాయిలో ఇవ్వడం అనేది ఏ న్యాయం? ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మహిళలే తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇబ్బందులు పడే పరిస్థితి రావడం ప్రభుత్వాలకు సిగ్గుచేటు కాదా? నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోతున్నారని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ తిరుగుతూ గర్భిణీల ఆరోగ్యంపై పర్యవేక్షణ, చిన్నారులకు టీకాలు వేయించే కార్యక్రమం, పోషణపై అవగాహన కల్పించడం, వ్యాధుల నియంత్రణలో సహకరించడం వంటి ఎన్నో కీలక బాధ్యతలు ఆశా వర్కర్లపై ఉన్నాయి. ప్రజారోగ్య వ్యవస్థకు క్షేత్రస్థాయిలో బలమైన అండగా నిలుస్తున్న ఈ మహిళల శ్రమ లేకుండా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు అమలవ్వడం కష్టమేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాగా ఇంతటి బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆశా వర్కర్లకు సరైన వేతనం, ఉద్యోగ భద్రత వంటి ప్రాథమిక హక్కులు మాత్రం దూరంగానే ఉన్నాయి. రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించడం కూడా కష్టమైందని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూటగడవడమే కష్టంగా మారిందని, అప్పుల మీదే జీవనం సాగించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యల విషయంలో మాత్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న మహిళలకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని వారు వాపోయారు. ఏళ్లుగా ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, నిరసనలు చేపడుతున్నా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని, కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను ప్రతి నెలా సమయానికి చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారత గురించి మాట్లాడుతున్న ఈ సమయంలో ప్రజారోగ్య వ్యవస్థకు అండగా నిలుస్తున్న ఆశా వర్కర్ల పరిస్థితి మాత్రం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఈ మహిళల జీవితాల్లో కూడా నిజమైన "ఆశ" నింపేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్లు కోరుతున్నారు.

### కష్టానికి తగిన గుర్తింపు అందని ద్రాక్షగానే ఉంది.



ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవస్థలో కనిపించని సైనికులు ఉంటే, వాళ్లలో ముందుండేవారు ఆశా వర్కర్లు. గ్రామం నుంచి పట్టణం వరకు ఇంటింటికీ వెళ్లి గర్భిణుల ఆరోగ్యం చూసుకోవడం, చిన్నారుల టీకాలు, వ్యాధులపై అవగాహన కల్పించడం... ఇలా ఆరోగ్య సేవలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నా, మా కష్టానికి తగిన గుర్తింపు మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. "ఆశా వర్కర్లు చేస్తున్న శ్రమను ప్రభుత్వం గుర్తించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మాకు కూడా అవకాశం కల్పించాలి. ముఖ్యంగా మా పనికి సౌలభ్యం కలిగేలా ఎలక్ట్రానిక్ టూ వీలర్స్ అందిస్తే గ్రామాల్లో ప్రజలకు సేవ చేయడం మరింత సులభమవుతుందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మా సేవను గుర్తిస్తే... ఆశా వర్కర్ల జీవితాల్లో కూడా ఆశ వెలుగులు వెలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

**- సబియా కూకట్ పల్లి కన్వీనర్ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్**

### పారితోషిక విధానాన్ని తొలగించి కనీస వేతనాలు అమలు చేయాలి



ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల పరిస్థితి మాత్రం ఇప్పటికీ మారలేదు. గ్రామాలు, బస్తీల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నా వారి సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. ఆశా వర్కర్ల విద్యా అర్హతను పరిగణనలోకి తీసుకొని వారికి ఏఎన్ఎం, జీఎన్ఎమ్ వంటి ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నేళ్లుగా సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కేవలం పారితోషికం ఇవ్వడం సరిపోదని, పారితోషిక విధానాన్ని తొలగించి కనీస వేతనాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాదు, గత రెండు నెలలుగా జీతాలు అందకపోవడం వల్ల ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాన్ని నడిపించుకోవడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే తమ సేవను గుర్తించి, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**-అనిత మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్**

## స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు

**శంకర్ పల్లి మార్చి 07(ప్రజాక్షేత్రం):** యువ శౌర్య సేన ఆధ్వర్యంలో పీఎం శ్రీ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు మెడల్స్ బహూకరించడం జరిగింది. యువ శౌర్య సేన ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ రవీందర్ లంటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అండ్ ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత మాట్లాడుతూ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యం అన్నారు. క్రీడల వలన విద్యార్థులకు ఆరోగ్యం మరియు శరీర దారుఢ్యం ఏకాగ్రత, నాయకత్వపు లక్షణాలు కలుగుతా యిఅన్నారు. పీఎం శ్రీ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎన్. శోభారాణి మాట్లాడుతూ స్పోర్ట్స్ మేట్ నిర్వహించిన యువ శౌర్య సేన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో పిడి అశోక్, వైస్ ప్రెసిడెంట్ గంగాధర్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ హర్షిని, పాషా విద్యార్థులు పాల్గొన్నారు.



